సాక్షి విశాఖపట్నం

గురువారం । 5 । జనవరి । 2023



రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించను

కాంట్రాక్టర్లకు కమిషనర్ హెచ్చరిక 8లో



సినిమా షూటింగ్‌లకు కేంద్రంగా విశాఖ

తెలుగు ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ దామోదర్‌ప్రసాద్ 8లో



సంక్రాంతి పండక్కి ప్రత్యేక రైళ్లు 8లో

న్యూస్‌రీల్

టౌన్‌ప్లానింగ్‌లో బదిలీల పర్వం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పలు జోన్లలో విధులు నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని బదిలీ చేస్తూ కమిషనర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జోన్–7లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.శ్రీనివాసరావును జోన్–1 ఏసీపీగా బదిలీ చేశారు. జోన్–2 టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఝాన్సీని జోన్–1కు, జోన్–8 టీపీవో సీహెచ్ రఘునాధరావును జోన్–2 టీపీవోగా, జోన్–6 టీపీ అండ్ బీవో వై.హేమంత్‌కుమార్‌ను జోన్–2 టీపీ అండ్ బీవోగా, జోన్–8 టీపీ అండ్ బీవోగా సీహెచ్.అనితను జోన్–3 టీపీ అండ్ బీవో, జోన్–6 ఏసీపీగా ఉన్న ఐ.వి.రమణమూర్తిని జోన్–5 ఏసీపీగా బదిలీ చేశారు. అలాగే జోన్–5 ఏసీపీ ఎం.అరుణవల్లిని గాజువాక జోన్ ఏసీపీగా, జోన్–2 ఏసీపీ ఎస్ఎస్ షబ్నన్‌ను జోన్–8 ఏసీపీగా బదిలీ చేశారు. ఇటీవల పులువురు జోనల్ కమిషనర్లను బదిలీ చేసిన విషయం విదితమే.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.83 కోట్లు



హుండీల ఆదాయం లెక్కింపుని పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 54 రోజులకు గాను కోటి 83లక్షల తొమ్మిదివేల 154 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ బేడా మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హుండీల ఆదాయం లెక్కింపు జరిగింది. నగదుతో పాటు 10.040 గ్రాముల బంగారం, 143.240 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు.

9న నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా

కంచరపాలెం : విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 9న తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా–2023 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉపసంచాలకుడు ఆర్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ అన్ని ట్రేడుల అభ్యర్థులు ఈ అప్రెంటిస్ షిప్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఈపీడీసీ లిమిటెడ్‌తో పాటు సుమారు 25కి పైగా ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం పాత ఐటీఐలో ఉదయం 9 గంటలకు నేరుగా హాజరు కావాలని కోరారు.


సంజీవని నిధికి రూ.లక్ష విరాళం



కలెక్టర్ మల్లికార్జునకు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉష

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సంజీవని–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష రూ.లక్ష విరాళం అందించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ మల్లికార్జునను కలిసి.. ఈ మొత్తం చెక్కును ఆయనకు అందజేశారు.

21 నుంచి వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్



ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లిక్, నవీన్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు సంధ్య గోడె, సోనల్ శార్దా, ప్రియ తెలిపారు. నగరంలోని ఓ హోటల్ బుధవారం ఫెస్ట్ వివరాలను వెల్లడించారు. నాలుగేళ్లు దాటిన వారికి ది అడ్వెంచర్స్ ఆఫ్ తారా, 7 ఏళ్లు దాటిన వారికి ఘోస్ట్ ఆఫ్ ది మౌంటైన్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుందన్నారు. ఆసక్తి గల వారు 98666 28484, 99851 22022 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఫెస్ట్ పోస్టర్‌ను కంకటాల మల్లిక్, డీవీ సీ ఫుడ్స్ ఎండీ నవీన్ ఆవిష్కరించారు.

● దివికేగిన ఆంధ్రా కురియన్

సేవాతత్పరుడు క్షీర సాగరుడు

- హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి
- ఆయన స్వగ్రామమైన యలమంచిలిలో నేడు అంత్యక్రియలు



రైతుల్లో రైతుగా.. వారికి పెద్దన్నగా నిలిచారు. పొట్ట చేతపట్టుకు వలసపోయే దుస్థితి లేకుండా తమ గ్రామాల్లోనే గౌరవప్రదంగా బతికేట్టు చేశారు. వాళ్లకు ఏ అవసరం వచ్చినా డెయిరీ ఉందంటూ ధీమానిచ్చారు. ఇందుకోసం అహర్నిశలూ శ్రమించారు. పాడిరైతుల పెన్నిధి ఆయన. వారి కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం.. వారి పిల్లలకు చక్కని చదువులు.. గ్రామాల్లో వంతెనలు, కల్యాణమండపాల నిర్మాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆడారి తులసీరావు చేసిన పనులు, సాధించిన ఘనతలు కోకొల్లలు. పదో తరగతి కూడా పాసవని ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఇన్ని పనులు చేశారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. స్ఫూర్తివంతం.. ఫలవంతం ఆయన జీవితం.

మునగపాక/అనకాపల్లి రూరల్: సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు.. అసామాన్యుడిగా ఎదిగారు.. ఆంధ్రా కురియన్‌గా పిలుచుకునే ఉత్తరాంధ్ర దిగ్గజం ఆడారి తులసీరావు ఒక వ్యక్తి కాదు వ్యవస్థ. 1986లో విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఆయన పగ్గాలు చేపట్టారు. ఆ రంగంలో అపూర్వ విజయాలు సాధించారు. విశాఖ డెయిరీ సామర్థ్యాన్ని ఇప్పుడు 9 లక్షల లీటర్ల స్థాయికి తీసుకువచ్చారు. ఆయన చైర్మన్‌గా ఎన్నికైనప్పుడు 50 సొసైటీలు ఉండగా ఇప్పుడవి 1700 సొసైటీలు, 3,700 పాలసేకరణ కేంద్రాల వరకూ విస్తరించాయి. రూ.11 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీని అంచెలంచెలుగా అభివృద్ధి చేసి ప్రస్తుతం రూ. 2 వేల కోట్ల టర్నోవర్ కంపెనీగా అభివృద్ధి చేశారు. 40కి పైగా దేశాల్లో పర్యటించి అధ్యయనం చేసి పాడిపరిశ్రమ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు.

సేవల్లోను అగ్రస్థానం

విశాఖ డెయిరీ అభివృద్ధి విషయంలోనే కాకుండా రైతులకు, డెయిరీ కార్మిక కుటుంబాలకు అవసరమైన సేవలను అందించడంలో కూడా ఆయన ఎల్లప్పుడూ ముందున్నారు. గ్రామాల్లో ఎన్నో రహదారులు, 40 కాలువలు, లెక్కలేనన్ని కల్వర్టులు, రెండు రిజర్వాయర్లు, 20 కల్యాణ మండపాలు నిర్మించారు. పాల ఉత్పత్తిదారులకు, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం విషయంలో బాధ్యత తీసుకొన్నారు. రైతుల పిల్లలకు నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగాలను వేయించారు. అంగవైకల్యం ఉన్న అనేకమందికి డెయిరీలో ఉద్యోగాలిచ్చి ఆశ్రయం కల్పించారు. డెయిరీ లాభాల్లో పాల ఉత్పత్తిదారులకు వాటా ఇచ్చారు. రైతులకు పశుగ్రాసం అందించడానికి కృషి చేశారు. మునగపాక మండలంలోని మెలిపాక నుంచి యాదగిరిపాలెం మీదుగా యలమంచిలి చేరుకునేందుకు వీలుగా రూ.8.5 కోట్ల వ్యయంతో తులసీ వారధి నిర్మించారు. మునగపాకలో కళాప్రదర్శనల కోసం తులసీ కళావేదిక ఏర్పాటుకు రూ.25 లక్షలు మంజూరు చేశారు. అక్కడే రూ.75 లక్షల వ్యయంతో కళ్యాణమండపం నిర్మించారు. మిల్క్ ప్రొడ్యూసర్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్–మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలందించారు. పాఠశాలలు, జూనియర్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందించారు. దాదాపుగా 1700 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించారు. 1500కు పైగా గ్రామాల్లో వ్యవసాయ బోర్ వెల్స్ ఉచితంగా ఏర్పాటుచేశారు.

ఇంతింతై వటుడింతై...

యలమంచిలిలో ఆడారి వెంకట రమణయ్య, సీతయమ్మ దంపతులకు తులసీరావు 1939లో జన్మించారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తులసీరావు పెద్దగా చదువుకోలేనప్పటికీ ఎన్నో విజయాలు సాధించారు. ఆయన తాత ఆడారి వీరినాయుడు అప్పట్లో విశాఖ జిల్లా బోర్డు సభ్యుడిగా రాజకీయాల్లో వుండేవారు. ఆయన వారసత్వం తులసీరావుకు వచ్చింది. రాజకీయ సువాసనలు ఒంట బట్టించుకున్న తులసీరావు 24 ఏళ్ల పిన్నవయస్సులోనే 1963లో యలమంచిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1968, 1981 ఎన్నికల్లో కూడా సర్పంచ్‌గా గెలిచారు. మధ్యలో 11 ఏళ్లు ఎన్నికలు జరగకపోయినా ఆయనే పెద్ద దిక్కుగా వుండేవారు. ఆయన కుమార్తె పిళ్లా రమాకుమారి రెండుసార్లు యలమంచిలి సర్పంచ్‌గా సేవలందించారు. ప్రస్తుతం యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

దశదిశలా విశాఖ డెయిరీ



గాజువాక/అక్కిరెడ్డిపాలెం: తులసీరావు సుమారు నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలోని ఏ ఇతర ప్రాంతాలకూ గాజువాక నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగ్గాలేని రోజుల్లో డెయిరీని గాజువాకలో ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాల్లోనూ పాల వ్యాపారం విస్తరించేందుకు గాజువాకను ఆనాడే కేంద్రంగా ఎన్నుకున్నారు. ప్రారంభ దినాల్లో ప్రతిరోజు 3 నుంచి 4 వేల లీటర్ల పాలను సేకరించి సరఫరా చేసేవారు. తులసీరావు కృషితో ఆ సేకరణ ప్రస్తుతం రోజుకు 9 లక్షల లీటర్లకు చేరింది. పాల సేకరణతోపాటు విశాఖ డెయిరీని బహుముఖంగా అభివృద్ధి చేశారు. అనేక రకాల పాల ఉత్పత్తులు, నెయ్యి పెరుగు, లస్సీ, మిఠాయిలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డెయిరీ విస్తరణలో భాగంగా రాజమండ్రిలో 2013లో మరోప్లాంట్ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు పాల ఉత్పత్తుల్లో విశాఖ డెయిరీని నంబర్ వన్‌గా నిలబెట్టారు. దానికి ఆధునిక టెక్నాలజీని జోడించి పాల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. సహజంగా వేసవి కాలంలో పాలకు కొరత ఉంటుంది. ఈ కొరతను అధిగమించడానికి ఎక్కువ పాలను సేకరించి వాటిని పొడిగా చేసి అందిస్తున్నారు. టెట్రా ప్యాక్, నిల్వ ప్యాకెట్లు తయారు చేసి వినియోగదారులకు నిరంతం అందుబాటులో ఉంచుతున్నారు. విశాఖ డెయిరీ ఉత్పత్తులను విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అందుకే ఆయన పాల ఉత్పత్తిలో ఆంధ్రా కురియన్‌గా కీర్తినందుకున్నారు.

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యలమంచిలి రాక

- విశాఖ డైయిరీ చైర్మన్ తులసీరావుకి నివాళులర్పించనున్న సీఎం



యలమంచిలిలో హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమీ సాలి, జేసీ కల్పనాకుమారి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం యలమంచిలికి రానున్నారు. గన్నవరం నుంచి బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ఇంటికి చేరుకుంటారు. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. 12.25 గంటలకు తిరిగి పయనమై ఒంటి గంటకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంటారు. అక్కడ నుంచి 1.10 గంటలకు విమానంలో బయలుదేరి 2 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా
- కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి వాటిని ప్రోత్సహించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, లింగ నిర్ధారణ పరీక్షలు వంటి అంశాలపై వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్త్రీ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అందుకు గల కారణాలపై విశ్లేషించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలు, ఆస్పత్రులు, ల్యాబ్‌లపై డెకాయ్ ఆపరేషన్స్ ముమ్మరంగా చేయాలన్నారు. మాతా–శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, దీనిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాలికా నిష్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కేజీహెచ్ వైద్యులు వైఎల్ నర్సింగరావు, పి.బుజ్జిబాబు, చక్రవర్తి, సంధ్య, దిశ స్టేషన్ ఎస్ఐ రేవతి, ఏపీఆర్‌వో సునీల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శోభారాణి, మురళీ కృష్ణ, డాక్టర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్ మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ జిల్లాలో ఎలా వేస్తున్నారనే దానిపై సంబంధిత విభాగపు అధికారులతో సమీక్షించారు.

ఎయిర్ కార్గోకు బ్రేక్!

- విమానాశ్రయాల్లో స్క్రీనర్స్ ఏర్పాటు చేయకపోవడమే కారణం
- కార్గో ఆపరేషన్లను నిలిపివేసిన బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ
- విశాఖ, విజయవాడ సహా తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లోనూ..
- ఈనెల 1 నుంచి ఆగిన సరకు రవాణా
- త్వరలోనే పునరుద్ధరణ అవుతుందన్న ఆశాభావం
- కొన్నేళ్లుగా పాసింజర్ విమానాల్లోనే సరకు చేరవేత
- ఇలాంటి పరిస్థితి ఇదే తొలిసారి



విశాఖ ఎయిర్‌పోర్టులో విమానంలోకి సరకు లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: ఎయిర్ కార్గోకు బ్రేక్ పడింది. విమానాశ్రయాల్లో సరకు రవాణాకు అవసరమైన స్క్రీనింగ్ పరికరాల నిర్వహణకు నిపుణులైన స్క్రీనర్లు లేకపోవడం కార్గో నిలిచిపోవడానికి కారణమైంది. ఎయిర్‌పోర్టుల్లో ఇన్నాళ్లు ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. కొన్నాళ్ల నుంచి ఆ బాధ్యతలను బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సంస్థ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో ఈనెల ఒకటో తేదీ నుంచి విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం సహా దేశంలోని రాయ్‌పూర్, ఔరంగాబాద్, రాజమండ్రి, కోయంబత్తూరు, మధురై, రాంచీ, భువనేశ్వర్ విమానాశ్రయాల్లో ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపివేసింది. ఇతర ఎయిర్‌పోర్టుల నుంచి కార్గో దిగుమతికి ఎలాంటి అభ్యంతరం లేదు. కేవలం సరకులను ఎగుమతి చేయడాన్నే ఆపింది. బీసీఏఎస్ నిర్ణయం తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. పాసింజరు విమానాల్లో కేటాయించిన మేరకు వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది. బీసీఏఎస్ ఆదేశాలతో ఈనెల ఒకటో తేదీ నుంచి విమానాల్లో సరకు రవాణా ఆగిపోయింది. ఈ తరహా కార్గో రవాణా నిలిచిపోవడం ఇదే తొలిసారి. మరోవైపు కార్గో రవాణాను తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టు అధికారులు ఎవరి స్థాయిలో వారు ఒత్తిడి తెస్తున్నారు.

రోజుకు పది టన్నుల కార్గో..

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. అంటే రోజుకు సరాసరి 10 టన్నుల కార్గో రవాణా అవుతోందన్న మాట! వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల ద్వారా తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టిక్కెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విశాఖ నుంచి ప్రత్యేక కార్గో విమానాలను నడపాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఒ.నరేష్‌కుమార్ 'సాక్షి'తో చెప్పారు. అలాగే ఇక్కడ మల్టిపుల్ కూలింగ్ జోన్లను ఏర్పాటు చేయాలని, కార్గో హ్యాండ్లింగ్ సదుపాయాలను మరింత పెంచాలని కోరారు.

త్వరలోనే పరిష్కారం



సరకు రవాణాలో భద్రత అంశాలను పటిష్ట పరచడంలో భాగంగా బీసీఏఎస్ స్క్రీనింగ్ వ్యవస్థను కట్టుదిట్టం చేస్తోంది. కొన్ని ఎయిర్‌పోర్టుల్లో దీని అమలులో జాప్యం జరిగింది. దీంతో జనవరి 1 నుంచి కార్గో రవాణాను నిలిపివేసింది. సంబంధిత అధికారులు బుధవారం విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చి స్క్రీనింగ్ ఏర్పాట్లను పరిశీలించి వెళ్లారు. సరకు రవాణా సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాం.

–కె.శ్రీనివాసరావు, డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు

విమ్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 7 సీఆర్మ్ టెక్నీషియన్లు, 12 ఓటీ టెక్నీషియన్ల పోస్టుల భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్హతుల జిరాక్స్ కాపీలు జతచేసి దరఖాస్తును జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. http://visakhapatnam.ap.gov.in నుంచి సంబంధించిన దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు.

జి-20 సదస్సు ఏర్పాట్లపై సమీక్ష

- మార్చి 28, 29 తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహణ
- కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున వెల్లడి



సదస్సు ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, అధికారులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖ వేదికగా మార్చి 28, 29 తేదీల్లో జరగనున్న ప్రతిష్టాత్మక జి–20 సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. జి –20 సదస్సు ఏర్పాట్లు, నిర్వహణపై జీవీఎంసీ, రెవెన్యూ, టూరిజం, వీఎంఆర్డీఏ అధికారులతో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జి–20 సదస్సుకు 20 దేశాల నుంచి అతిథులు రానున్నారని, వారికి ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సదస్సు వేదిక వద్ద ఏర్పాట్లు, అతిథులకు కల్పించే సదుపాయాలపై చర్చించారు. స్థానికత ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశాల అనంతరం అతిథులు విశాఖలోని వివిధ పర్యాటక ప్రదేశాలు సందర్శిస్తారని, ప్రతి చోటా మన సంస్కృతి కనిపించేలా చూడాలన్నారు. పట్టణంలో అన్ని కూడళ్లు, రోడ్లు, పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రతతో సుందరంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు సూచించారు. ఆర్.కె.బీచ్, రుషికొండ, యారాడ బీచ్, ఎర్రదిబ్బలు, తొట్లకొండ, కైలాసగిరి, జూపార్క్ తదితర ప్రాంతాలను ప్లాస్టిక్ ఫ్రీగా రూపొందించాలన్నారు. కార్యక్రమం జరిగే రోజుల్లో ఆయా ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కేంద్రాలు తనిఖీ చేసిన తర్వాత అనుమతులివ్వండి'

మహారాణిపేట(విశాఖ దక్షిణ): దరఖాస్తు చేసుకున్న అసిస్టెంట్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాలను పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఏఆర్‌టీ, సరోగసీ జిల్లా కమిటీ, డిస్ట్రిక్ట్ మెడికల్ బోర్డు సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పరిశీలించి.. కేంద్రాలు తనిఖీలు చేసిన తర్వాతే అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వై.నరసింహారావు, కేజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ పి.బుజ్జిబాబు, కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు, ధ్యానంతో ఆరోగ్య పరిరక్షణ



బ్రహ్మకుమారీస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీజేఎఫ్, విస్టా ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఎంత పని ఒత్తిడిలోనైనా కాసేపు ఆటలు ఆడటం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాస్ అన్నారు. అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా పోర్ట్ స్టేడియంలో బుధవారం ఆయన ఇండోర్ గేమ్స్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పాత్రికేయులు పాటు పడాలన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ప్రతినిధి బి.కె.రామేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగాలన్నారు. బ్రహ్మకుమారీస్ క్యాలెండర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించి, ప్రసాద వితరణ చేశారు. క్యారమ్స్, చెస్ పోటీల్లో జర్నలిస్టులు ఉత్సాహంగా తలపడ్డారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్టా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించను

కాంట్రాక్టర్లకు కమిషనర్ హెచ్చరిక

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. వీఐపీ రోడ్డు, సర్క్యూట్ హౌస్, వాల్తేర్ క్లబ్ రోడ్డును థర్డ్ పార్టీ కంట్రోల్ బోర్డ్ నిపుణులతో కలిసి బుధవారం పరిశీలించారు. నిర్మించిన రోడ్డు నమూనాలను ఎంత పరిమాణంలో తీస్తారు, ఏ ల్యాబ్‌కు పంపిస్తారు, ఎన్ని రోజుల్లో నివేదిక వస్తుందని క్వాలిటీ కంట్రోల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తారు రోడ్డు మందం 40 మీటర్లు ఉందా లేదా అని స్వయంగా తవ్వించి పరిశీలించారు. కొలతల్లో తేడా ఉంటే.. పరిమాణాన్ని బట్టి సంబంధిత కాంట్రాక్టర్ బిల్లు నుంచి తగ్గిస్తామని.. అటువంటి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామన్నారు. నియమ నిబంధనల ప్రకారం థర్డ్ పార్టీ కంట్రోల్ బోర్డ్ సర్టిఫికెట్ జారీ చేయాలన్నారు. అనంతరం పోలమాంబ గుడి ఎదురుగా ఈఎస్‌టీ ఆస్పత్రి రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ ప్రాథమిక హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్‌రాజు, రామ్మోహన్‌రావు, గోవిందరావు, క్వాలిటీ కంట్రోల్ సభ్యులు పాల్గొన్నారు.



ఇటీవల వేసిన రోడ్డును తవ్వించి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

శాంతినగర్ టీచర్లకు షోకాజ్ నోటీసులు

పాఠశాల నిర్వహణపై డీఈవో అసంతృప్తి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

సింహాచలం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన చిన ముషిడివాడలోని శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు డీఈవో ఎల్.చంద్రకళ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్యంతో నిండిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, వర్క్‌బుక్స్, నోట్ పుస్తకాల దిద్దుబాటు, జగనన్న విద్యా కానుక, పరీక్ష సమాధాన పత్రాలు పరిశీలించి సరిగ్గా లేకపోవడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. వాటిపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అసంతృప్తి చెందారు. 10వ తరగతి సిలబస్ను సకాలంలో పూర్తి చేయాలని, శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠ్య పథకాలు, డైరీలు, బోధనాభ్యాసన సామగ్రి తయారు చేయాలన్నారు. ప్రతి రోజూ విద్యార్థులు బూట్లు, టై, బెల్ట్ ధరించేలా చూడాలన్నారు. తదుపరి సమీక్ష సమయానికి పరిస్థితిని చక్కదిద్దాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రధానాచార్యులు యు.మాణిక్యం నాయుడు, ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీ శంకరరావు, ఉపన్యాసకులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, సీఆర్‌పీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాల ఏర్పాటు

సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం సెక్షన్ 19ని అనుసరించి ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నారాయణమూర్తి కోరారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశాలో బుధవారం నిర్వహించిన సీనియర్ సిటిజెన్స్ 21వ జాతీయ మహాసభల్లో ఆయన ప్రసంగించారు. కోవిడ్ కారణంగా కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వే ప్రయాణాల్లో తీసి వేసిన సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. బ్యాంకుల్లో దాచుకునే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని సీనియర్ సిటిజెన్స్‌కు జాతీయ విధానం క్లాజును అనుసరించి అధిక వడ్డీ ఇవ్వాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో జాతీయ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి, డి.డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముదపాక లేఅవుట్ పనుల ప్రారంభం

భారీగా పోలీస్ బందోబస్తు



లేఅవుట్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ మల్లయ్యనాయుడు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

సింహాచలం: పెందుర్తి మండలం ముదపాకలోని జగనన్న లేఅవుట్‌లో బుధవారం పనులు ప్రారంభమయ్యాయి. పోలీస్ బందోబస్తు మధ్య జీవీఎంసీ అధికారులు జియోట్యాగింగ్ తదితర పనులను ప్రారంభించారు. ముదపాకలోని భూముల్లో జగనన్న లేఅవుట్లు వేసి జీవీఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. కానీ కొంత మేర భూములకు సంబంధించి న్యాయపర సమస్యలు ఉన్నాయని స్థానిక రైతులు కొంతమంది తరచూ ఆందోళనలకు దిగుతున్నారు. దీంతో రైతులు, అధికారులకు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. కోర్టు వివాదాలు లేని భూముల్లో పనులు చేసేందుకు అధికారులు ఉపక్రమిస్తున్నా.. రైతులు ఆ పనులు అడ్డుకుంటున్నారు. దీంతో గడిచిన మంగళవారం పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఏడుగురు రైతులపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల పహారా మధ్య బుధవారం అధికారులు ఇక్కడ పనులు ప్రారంభించారు. కోర్టు వివాదాలు లేని భూముల్లో మాత్రమే పనులు చేస్తున్నామని జెడ్పీ మల్లయ్యనాయుడు తెలిపారు. ఈ తరుణంలోనే పలువురు లబ్ధిదారులు అక్కడకు చేరుకుని తమకు హామీ పత్రాలు ఇచ్చారు కానీ, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని జెడ్పీ వద్ద తమ గోడు వినిపించారు. తమ స్థలం ఎక్కడ ఉందో తెలియదని, న్యాయ వివాదాలు ఉన్న చోట కూడా కొంత మందికి పట్టాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్పీ మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ స్థలాలు వస్తాయని హామీ ఇచ్చారు. ఒకవేళ న్యాయ వివాదాలు పరిష్కారం కాకపోతే లబ్ధిదారులకు ఆనందపురం మండలంలో స్థలాలు అందిస్తామని తెలిపారు.

సంక్రాంతి పండక్కి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-వికారాబాద్ మధ్య వయా దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- కాచిగూడ-శ్రీకాకుళం రోడ్(07611) రైలు: కాచిగూడలో ఈ నెల 10న సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45కు దువ్వాడ చేరుతుంది. తిరిగి 5.47కు బయలుదేరి అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- శ్రీకాకుళం రోడ్-వికారాబాద్(07612) రైలు: శ్రీకాకుళం రోడ్‌లో ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.10కు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.47కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.50గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది.
- వికారాబాద్-శ్రీకాకుళంరోడ్(07613) స్పెషల్: వికారాబాద్‌లో ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.45కు దువ్వాడ చేరుతుంది. తిరిగి 5.47కు బయలుదేరి అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- శ్రీకాకుళం రోడ్-కాచిగూడ(07614) స్పెషల్: శ్రీకాకుళం రోడ్‌లో ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.20కు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.22కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

రైళ్ల గమ్యం కుదింపు, దారి మళ్లింపు..

- వాల్తేర్ డివిజన్ కే-ఆర్ లైన్ కోరాపుట్-మనబర్, కోరాపుట్-దుమురిపుట్ సెక్షన్ల మధ్య జరుగుతున్న ట్రాక్ ఆధునికీకరణ, రెండో ట్రాక్ పనుల నిమిత్తం పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు ఎ.కె.త్రిపాఠి తెలిపారు.
- విశాఖపట్నం-కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 5 నుంచి 10 వరకు లక్ష్మీపూర్ రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 6 నుంచి 11 వరకు లక్ష్మీపూర్ రోడ్ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కోరాపుట్(08512) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6, 9 తేదీల్లో దమన్‌జోడి వరకు మాత్రమే నడుస్తుంది. కోరాపుట్-విశాఖపట్నం(08511) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7, 10 తేదీల్లో దమన్‌జోడి నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- ఈ నెల 6న విశాఖలో బయలుదేరే విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 6న కిరండూల్‌లో బయలుదేరే కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ జయపూర్ వరకు మాత్రమే నడుస్తుంది.

విశాఖ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వసంత కృష్ణ



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు వసంత కృష్ణ

సీతమ్మధార(విశాఖ ఉత్తర): విశాఖ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వసంత కృష్ణను రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ద్వారకానగర్ మొదటి లైన్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాత అసోసియేషన్ కాలపరిమితి ముగియడంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుని అధ్యక్షుడిగా వసంత కృష్ణ, సెక్రటరీగా కామినేని సాంబశివరావు, కోశాధికారిగా సంజీవ రెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వసంత కృష్ణ మాట్లాడుతూ సమష్టిగా పనిచేస్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించవచ్చన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఏపీ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, అల్లూ కృష్ణ, వై.వెంకటేశ్వరరావు, శివారెడ్డి, మల్లికార్జునరావు, బాలిరెడ్డి, వెంకటేశ్వరరావు, తదితరులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్‌లకు కేంద్రంగా విశాఖ



వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అతిథులు

తెలుగు ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్

అల్లిపురం(విశాఖ దక్షిణ): ఉమ్మడి రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు ప్రధాన కేంద్రంగా విశాఖ మారిపోయిందని తెలుగు ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ అన్నారు. అల్లూరి విజ్ఞానకేంద్రంలో బుధవారం జరిగిన వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్-2023లో ఆయన మాట్లాడారు. జాలాది చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో విశాఖ వేదికగా ఐదు రాష్ట్రాలకు చెందిన కళాకారులకు అవార్డులు ప్రదానం చేయడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం సినిమా రంగంలో సక్సెస్ రేటు ఐదు శాతం మాత్రమే ఉందన్నారు. గతంలో ఇది ఎనిమిది శాతంగా ఉండేదన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ ఫౌండర్ జాలాది విజయ మాట్లాడుతూ ఫెస్టివల్‌ను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి జాలాది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పలు సినిమాలు, టెక్నీషియన్లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా స్నేహాంజలి సంస్థ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సినీ ప్రముఖులు సాయివెంకట్, నరసింగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తామాడ శ్రీనివాస్, సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గాప్రసాద్, ఐనాడ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా 'ఆర్గానిక్ మేళా'



ఆర్గానిక్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా ఆర్గానిక్ మేళా-2023 ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మేళా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. మేళా గౌరవ అధ్యక్షుడు పీఎల్‌ఎస్ రాజు మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ సహకారంతో గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తేదీన ప్రారంభ కార్యక్రమానికి మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతున్నట్లు తెలియజేశారు. ప్రకృతి ఆధారిత పంటలు, ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, విత్తనాలు విక్రయించనున్నట్లు వివరించారు. గో ఆధారంగా, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు వారి ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు విక్రయాలు చేస్తారన్నారు. రైతు సమ్మేళనం, మిద్దెతోట వంటి కార్యక్రమాలతో పాటు గో ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ జీఎస్‌ఎన్ రాజు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, రైతు మిత్ర టెర్రస్ గార్డెన్ నిర్వాహకుడు దాట్ల వర్మ, గ్రీన్ క్లైమేట్ అధ్యక్షుడు జేవీ రత్నం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలి



మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

24 గంటల నిరవధిక రిలే దీక్ష శిబిరంలో అఖిలపక్షాల నాయకులు

అగనంపూడి (గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ అగనంపూడి సారథ్యంలో అగనంపూడి కూడలిలో బుధవారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, వేలాది మంది నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. వేల ఎకరాల భూములను ఉక్కు కర్మాగారం కోసం ధారాదత్తం చేసిన నిర్వాసితుల భూములతో వ్యాపారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కార్పొరేటర్లు స్టాలిన్, ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, గంగారామ్, బొడ్డ జగన్ మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన నాయకులు, అఖిలపక్షాల కార్మిక సంఘాల నేతలు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ (పూర్ణ), నెల్లి శ్రీనివాసరావు, దాసరి త్రినాథ్, కర్రి దోరేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యనారాయణరావు, వంకర రాము, కరణం సత్యారావు, శీరంశెట్టి గోవిందరావు, పెదిరెడ్ల హరనాథ్, బొబ్బరి సూరి, సాంబశివరావు, గంతకోరు అప్పారావు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత విశాఖ

విజేతలకు బహుమతులు అందజేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విశాఖజిల్లా బాలిక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో విశాఖపట్నం జిల్లా జట్లు మొదటి స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా రాష్ట్రజట్టును ఎంపిక చేశారు. 66వ స్కూల్‌గేమ్స్ అండర్-19 బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి బాలికలు,బాలుర విభాగంలో జిల్లా జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా, శ్రీకాకుళం రెండో స్థానంలో, తూర్పుగోదావరి , కృష్ణా జిల్లాల జట్లు మూడో స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో విశాఖపట్నం మొదటి స్థానం, తూర్పుగోదావరి రెండో స్థానం, శ్రీకాకుళం జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గోతిరెడ్డి రాంబాబు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ప్రతిభ చూసే క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు తదతరులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాల కూల్చివేతకు యువకులతో బృందం ఏర్పాటు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధిలో అనధికార కట్టడాల కూల్చివేతకు వివిధ విభాగాలకు చెందిన 26 మంది యువకులను తీసుకున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీలో చైన్‌మెన్ వ్యవస్థను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

చైన్‌మెన్‌లపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గత కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చైన్‌మెన్‌గా పని చేసిన 26 మందిని వివిధ విభాగాలకు సర్దుబాటు చేశారు. తాజాగా తీసుకున్న యువకులతో అనధికార కట్టడాల కూల్చివేతకు చర్యలు తీసుకుంటామని మేయర్ వివరించారు.

నగరంలో నేడు

- ఉదయం 9:30 గంటలకు మురళీనగర్ శ్రీదేవి పార్కు సమీపంలో శ్రీదేవి ఛానల్ అధినేత ఇసుకపల్లి రామకృష్ణరాజు సంస్మరణ కార్యక్రమం
- ఉదయం 10 గంటలకు బీచ్‌రోడ్ బ్లాక్ అండ్ వైట్ హోటల్‌లో ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ జాగృతి సాధికారత సభ

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,750
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,100
వెండి(కిలో):	రూ.75,500